# భూగోళాన్ని రక్షించే శక్తి మాకే ఉంది

*వాతావరణ సంక్షోభం పై కమ్యూనిటీ ప్రకటన*

## ముందుమాట

సువిశాలమైన, సుసంపన్నమైన ఈ భారతావనిలో పర్వత ప్రాంతాలు, తీర ప్రాంతాలు, అడవులు, ఎడారులు, మైదానాలు, ఇసుక తిన్నెలలో శతాబ్దాల తరబడి ప్రకృతిలో సహజీవనం సాగిస్తూ, వ్యవసాయం, మత్స్యసంపద, అడవులు, వనాలతో ప్రపంచానికే తలమానికంగా ఉన్న భారత ప్రజలమైన మేమంతా ఈనాడు వాతావరణ మార్పుకు సంబంధించిన సమస్యలు, సంక్షోభ పరిష్కారానికి మా శక్తి యుక్తులన్నీ ఉపయోగించడానికి సంసిద్ధంగా ఉన్నాం.

మేము భారత ఈశాన్య ప్రాంతం నాగాలాండ్‌లోని "చకేసంగ్ నాగా" తెగలకు, బెంగాల్ సుందర్‌బాన్స్ లోని మాన్‌గ్రోవ్ తీరానికి చెందిన మత్స్యకారులు, రైతులు, అటవీ తెగలకు, ఒరిస్సా లోని చిల్కాకు చెందిన కౌంతా, ఖటియా, పంద్రా మరియు లోలియా తెగలకు, తమిళనాడులోని గల్ఫ్ ఆఫ్ మన్నార్‌కు చెందిన పరవ, ముత్తురాయర్‌లకు, ఒరిస్సాలోని నియాంగిరికి చెందిన డోంగ్రియా కొండిస్ జాతికి, జార్ఖండ్‌కు చెందిన సంథల్స్‌కు, మధ్య భారతంలోని మధ్య ప్రదేశ్‌కు చెందిన భిల్స్ అండ్ భిలాలస్‌కు, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన  బైగాస్‌కు, పశ్చిమాన గుజరాత్‌లోని మల్ధారీస్‌కు, తమిళనాడు పశ్చిమ కనుమలనుంచి నాడార్స్, దళిత మహిళలకు, ఆంధ్రప్రదేశ్‌లోని మెదక్ జిల్లాకు చెందిన దళిత రైతులకు, అలాగే తమిళనాడు శివకాశిలోని దళిత రైతులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాము. తూర్పు – పశ్చిమం, ఉత్తర – దక్షిణం, మధ్య – ఈశాన్య ప్రాంతాలకు చెందిన మేమంతా వాతావరణ సంక్షోభాన్ని అవగాహన చేసుకుని పరిష్కారాలు చర్చించడానికి చేయి చేయి కలపాం.  వ్యవసాయం, అడవుల పెంపకం, తీరప్రాంతాలలో మైదానాలతో పాటు మా జీవితాలతో, మా జీవనంతో ముడిపడి ఉన్న అన్నీ వ్యవస్థలతో మా అనుబంధాన్ని పున సమీక్షించుకోడానికి భాగస్వామ్య పద్ధతులతో పురోగమిస్తున్నాము.

ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి ప్రకృతితో మాకు గల బంధం, దాని వల్ల మాకు గల గౌరవం, ప్రకృతితో కలిసి మెలసి జీవించడం పై మన తాత తండ్రుల నుంచి నేర్చిన విషయాలు ఆధారంగా అధిక ఉష్ణోగ్రత, తక్కువ లోపభూయిష్ట వర్షపాతం, అనారోగ్యం పోషకాహార లోపం మొదలైన వాతావరణ మార్పు జనిత సమస్యలను అధిగమించే దిశగా అనేక మార్గాలు కనుగొనగలమన్న దృఢమైన నమ్మకం మాకుంది.

ఈ సంప్రదింపుల ద్వారా వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోగల సామర్థ్యానికి పునాదిగా .పరిగణించే శక్తి యుక్తులు బయటకు వచ్చి ఈ దిశలో ముందుకు సాగే ప్రోత్సాహాన్ని అందిస్తామన్నది మా విశ్వాసం.

## మా శక్తి యుక్తులు

1. పెద్ద ఎత్తున వృక్ష, జంతు వైవిధ్యం – మా వ్యవసాయక్షేత్రాలు, మా అడవులు, సముద్రాల నుంచి లభ్యమవుతున్న, రక్షణ కల్పిస్తున్న అలాగే, మాకు పరస్పర సంరక్షణ, నమ్మకంతో కూడిన అనుబంధం కలిగిన శాక, ఔషధ, స్థానిక విస్తృత రకాలు.

   ఒక వర్గంగా, ఒక సమూహంగా ప్రస్తుత వాతావరణ మార్పు వల్ల పర్యావరణానికి ఏర్పడిన ముప్పును ఎదుర్కోడానికి మనమంతా కట్టుబడి ఉండాలి.  నేల తల్లి బిడ్డలమైన మనం మన భూమి, మన సముద్రాలు మన మంచి తల్లి – నేల లేకుండా మనుగడ సాగించలేమనే అవగాహన మనకు ఉంది.  మన జీవనంలోను, జీవనోపాధిలోను, గౌరవప్రదమైన మనుగడలోను అంతర్భాగం నేల.   మన అడవులు, పగడపు దీవులు, ఇసుక తిన్నెలు ప్రకృతి వైపరీత్యాలనుంచి మనకు రక్షణ కల్పించడమే గాకుండా మనకు ఆహారాన్ని, పశుగ్రాసాన్ని, ఇతర జీవనోపాధి వనరులను అందిస్తున్నాయి.  భూమి పై మనతోపాటు నివసించే ఇతర జీవరాసులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. ఏళ్ళ తరబడి తుపానులు, నీరు నిలిచిపోవడం, ఉప్పునీరు వంటి సమస్యలతో మనం సతమతమవుతున్నాం.  వీటి ప్రతికూల ప్రభావాన్ని ఊహించి దాని నుంచి బయట పడే విజ్ఞానాన్ని మనం సంపాదించాలి.  సామాజిక కట్టుబాటు, సహజీవన సూత్రం వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సమిష్టి చర్యలు  చేపట్టడంలో కూడా మనకు తప్పక తోడ్పడుతుంది.

2. వారసత్వంగా మనకు లభించిన సుసంపన్నమైన ప్రాచీన విజ్ఞానం ప్రస్తుత వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి తప్పక దారి చూపుతుందని మా ప్రగాఢ విశ్వాసం. ఈ శతాబ్దాల నాటి సామాజిక విజ్ఞానంతో మనం మనతో పాటు పశు పక్ష్యాదులను పోషించుకోగలం. అంతే గాకుండా, ఆధునిక, యాంత్రిక, నీటి విస్తృతాధారిత వ్యవసాయ పద్ధతుల నుంచి మన పంట పొలాలను, వ్యవసాయ భూములను కూడా కాపాడుకోగలం. మార్పిడి సేద్యం వంటి మన ప్రాచీన పద్ధతులు అటవీవనరుల పునరుత్పత్తికి దోహదం చేస్తాయి. అలాగే పూలవనాలు, వన్య ప్రాణుల అభివృద్ధికి తోడ్పడుతాయి. మత్స్యకారులుగా మేము మా తాత ముత్తాతలకు విధేయతను, గౌరవాన్ని చాటుకుంటున్నాం. వారు మాకు పర్యావరణానికి హాని కలిగించని చేపల పెంపకం పద్ధతులను వారసత్వంగా అందించారు. ఎలాంటి హాని జరగని పర్యావరణ అనుకూల విధానాలను వారు మాకు అందించారు.

3. మాకు సాంప్రదాయంగా వచ్చిన విత్తన పొదుపు, మార్పిడి పద్ధతులతో పాటు, వాటితో మాకు గల పరిజ్ఞానం వాతావరణ పరిస్థితులతో మా కార్యకలాపాలకు విలువ కట్టలేని ఆస్తిగానే పరిగణించాలి. మా విత్తన పరిరక్షణ పద్ధతులు కూడా ప్రతికూల పరిస్థితులలో సైతం అనుసరించదగినవే. విలువైన జన్యు వాతావరణ అనుకూల విత్తన చేపల, రొయ్యల పరిరక్షకులమని మేము గర్వంగా చెప్పుకోగలం. అవే మాకు ఆహారాన్ని, జీవనోపాధిని మత్స్యకారులుగా గౌరవ ప్రదమైన జీవితాన్ని అందిస్తున్నాయి.

4. మా వ్యవసాయం కాలుష్య రహితం. స్వీయ పునరుత్పాదకం. తక్కువ ఇంధన ఆధారితం. అన్నింటికీ మించి వాతావరణ సమతూక సూత్రాలపై ఆధారపడినది. మా పంటల విధానం అనాదిగా వైవిధ్యమయినది. ఇది మాకు వైవిధ్య ఆహారాలను అందించడమే గాకుండా, మా భూములను సారవంతంగా, సస్యశ్యామలంగా ఉంచుతోంది. దీర్ఘకాలంగా మా వ్యవసాయానికి గీటురాయిగా ఉన్న సేంద్రియ విధానం మాకు సురక్షితమైన పూర్తి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తోంది. సాగు మార్పిడి విధానం 12 పంటలు పండించడానికి, 16 రకాల కూరగాయల సాగుకు, 21 రకాల ఆకుకూరల పెంపకానికి, పదిహేడుకి పైగా గడ్డి రకాలను పెంచడానికి ఉపయోగపడుతూ మా ఆహారం, విత్తన అవసరాలు తీరుస్తోంది. కొండల పైన, మైదానాలు, చిన్న కమతాలలో ఇప్పటికీ సాంప్రదాయ పంటలు సాగు చేస్తున్నాం. ఇవి వాతావరణ మార్పులకు తట్టుకోవడంతో పాటు నేలలోకి కార్బన్‌ను చేర్చడం ద్వారా వాతావరణ సంక్షోభాన్ని అధిగమించడానికి దోహదపడుతున్నాయి. ఉప్పును తట్టుకునే వరి రకాలు, ఇతర స్థానిక పంటలు, చెట్లు వాతావరణ సవాళ్ళకు రక్షణ కవచాలుగా ఉన్నాయి.

5. 20వ శతాబ్దం చివరి వరకు వైవిధ్య వ్యవసాయ పంటలకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చాం. విత్తనాల పై మా స్వీయ నియంత్రణ ఉండేది. అయితే తరువాత సైన్స్, వ్యవసాయ, విశ్వవిద్యాలయాల ఆగమనంతో మా సాంప్రదాయ విత్తనాల స్థానంలో హైబ్రిడ్ రకాలు ప్రవేశించాయి.

6. మా సాంప్రదాయ నీటి యాజమాన్య పద్ధతులు మా నీటి వనరులను పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉంచుతున్నాయి. వీటి వినియోగంలో మా విచక్షణ వల్ల భూగర్భ జలాలపై ఎలాంటి ఒత్తిడి పెంచడం లేదు. మేము అనుసరిస్తున్న మెళకువలు దుర్భిక్షం, నీటి కొరత నుంచి మమ్మల్ని కాపాడుతున్నాయి. ఉదాహరణకు మనుషులు, పశుపక్ష్యాదులకు మంచి నీటి కోసం ఇంకిపోయిన నదులలో ఇసుక చెలమలు ఏర్పరచుకునే పద్ధతి భూసార తేమను పరిరక్షించుకోవడానికి దోహదపడుతోంది. మాకు గల పరిజ్ఞానం మడ అడవుల పరిరక్షణకు, వాటి పునరుత్పత్తికి దోహదపడి, తుపాకులు, ఇతర వైపరీత్యాల నుంచి రక్షణ కవచంగా ఉంటున్నాయి. ప్రకృతి సమతూకం దెబ్బతినని విధంగా చేపలను వేటాడే ప్రాచీన సురక్షిత మైన పర్యావరణ అనుకూల విధానాలను మేము ఇప్పటికీ కొనసాగిస్తున్నాము. రొయ్యల పెంపకానికి వెదురు, వలల వంటి విధానాలు ఈ చిరు ప్రాణుల మనుగడకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. మడ అడవులు పగడపు దీవులు, ఇసుక తిన్నెల సంరక్షణకు, పునరుత్పత్తికి మేము కట్టుబడి ఉన్నాం. ఇవే మాకు తుపాకుల వంటి ప్రకృతి వైపరీత్యాలనుంచి రక్షణ కల్పించి, పలురకాల పుష్ప జాతులకు, వన్యప్రాణులకు ఆలవాలంగా ఉన్నాయి.

7. మా పరిసరాలలో విస్తారంగా ఉన్న ఔషధ మొక్కలు, వృక్ష జాతులను మాకు గల పూర్తి పరిజ్ఞానంతో సురక్షిత ఆరోగ్య సంరక్షణకు వినియోగిస్తున్నాం. వీటి వల్ల మాకు ఆరోగ్య వ్యయ భారం లేదు. ఆరోగ్య సంరక్షణకు మూలికలు, ఔషధ మొక్కల వినియోగంలో సాంప్రదాయ పద్ధతులను జోడిస్తున్నాం. పోషక విలువలు కలిగిన స్థానిక పంటలు చేపల ఆధారిత ఆహార ఉత్పత్తులు వ్యాధులను నివారించి మమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతున్నాయి. మా వృక్షాలు, ఔషధ మొక్కలు, మూలికలు, వైవిధ్య పంటలు వాతావరణ మార్పును ఎదుర్కోవడంలో కూడా ఎంతగానో దోహదపడుతున్నాయి.

9. మా అడవులు ప్రకృతి వైపరీత్యాల నుంచి మాకు రక్షణ కల్పిస్తున్నాయి. మాకు ఆహారాన్ని, పశుగ్రాసాన్ని అందిస్తున్నా.యి. జీవనోపాధిని కల్పిస్తున్నాయి. మాతో పాటు ఈ భూమి పై నివసించే అనేక జీవజాతులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి.

## మా డిమాండ్లు

ఎంతో గొప్పవైన మా ఈ సామాజిక ఆస్తులను గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టవలసిందిగా మేము భారత ప్రభుత్వాన్ని, ప్రపంచ దేశాలను డిమాండ్ చేస్తున్నాం. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి, ఇతర అభివృద్ధి సంస్థలనుంచి మేము ఈ క్రింది చర్యలను ఆశిస్తున్నాం.

1. మా వ్యవసాయ క్షేత్రాలు, పశు సంపద, అడవులు, సముద్రాలలోని వైవిధ్యాన్ని వైశిష్ట్యాన్ని నాగరిక ఆస్తులుగా గుర్తించాలి. వాటికి హాని కలిగించే ఏ చర్యా చేపట్టరాదు. వాతావరణ సంక్షోభం పై మా పోరాటంలో మౌలికమైన ఈ వనరులకు అధికారిక గుర్తింపు ఇవ్వాలి.

2. మేము ఆచరిస్తున్న, అనుసరిస్తున్న బహుళ విధ, పర్యావరణ ఆనుకూల వైవిధ్య వ్యవసాయ పద్ధతులు వాతావరణ మార్పు రక్షకాలని ధృవీకరించండి. విస్తారమైన కాయ ధాన్యాలతో సమ్మిళితమైన మా వ్యవసాయంలో విస్తారంగా ఆకు రాలి భూమిలో ఎక్కువ పరిమాణంలో కార్బన్ చేరేందుకు వీలవుతుంది. వ్యవసాయంలో మాకు గల పరిజ్ఞానాన్ని మేము అనుసరిస్తున్న మెరుగైన విధానాలను పరిగణనలోనికి తీసుకుని మా కమ్యూనిటీలను పర్యావరణ సమతూక కమ్యూనిటీలుగా గుర్తించాలని, మా ప్రాంతంలో రసాయనిక మందులను, క్రిమిసంహారక మందులను చట్టబద్ధంగా నిషేదించాలని మేము కోరుతున్నాం. ఈ తరహా వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సాహించడానికి ఇందులో కార్బన్ పరిమాణాన్ని మదింపు చేసి సంబంధిత ప్రోత్సాహకాల ద్వారా మా కమ్యూనిటీలు ప్రయోజనం పొందే అవకాశం కల్పించాలి. మేము అనుసరిస్తున్న పర్యావరణ అనుకూల వైవిధ్య భరిత వ్యవసాయాన్ని వాతావరణ మార్పు ప్రతికూల ప్రభావాలనుంచి ఉపశమనం కలిగించే అనువైన వ్యవసాయంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. గుత్తాధిపత్య సాంస్కృతికీకరణను నివారించి మా బహుళ విధ పంటలు, జీవనోపాధి, ఆహారం సంస్కృతి వ్యవస్థలను పరిరక్షించడానికి విధానపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

3. శతాబ్దాల తరబడి మేము ఉపయోగిస్తున్న సాంప్రదాయ విత్తనాలను అభివృద్ధి పరచండి. చాలా తక్కువ నీటితోనే ఇవి మొలకెత్తుతాయి. అధిక వేడిని సైతం తట్టుకుంటాయి. మా విత్తనాల నాణ్యత రానున్న సంవత్సరాలు, దశాబ్దాలలో కూడా వాతావరణ సంక్షోభం నుంచి మమ్మల్ని ఆదుకోగలవన్న విశ్వాసం మాకుంది. కనుక వాటిని గుర్తించి వాటిని అభివృద్ధి పరుస్తున్న రైతాంగానికి ఇతర కమ్యూనిటీలకు ప్రోత్సాహకాలు అందించే విధానాలు రూపొందించాలి.

4 తోటల పెంపకానికి బదులు వాతావరణ సమతూకం పై దృష్టి సారించే విధంగా ప్రభుత్వ ఆటవీ విధానం ఉండాలి. స్థానిక భూసారానికి, స్థానిక వాతావరణ పరిస్థితులకు పర్యావరణానికి అనువైన వృక్ష జాతులను ప్రోత్సహించాలి. మా భూములకు, మా సంస్కృతికి మా ప్రజలకు ఎంతమాత్రం పరిచయం లేని విత్తన రకాలను, వృక్ష జాతులను ప్రవేశపెట్టే ప్రయత్నం చేయవద్దు. మా అడవులలోని జీవవైవిధ్యం వాటికి ప్రాచుర్యం కల్పించిన స్థానిక రకాలు మా ఉన్నతికి మూలాధారం. ఎట్టి పరిస్థితులలోను వీటిని పదిల పరుచుకోవాలి. వీటిపై నియంత్రణ హక్కులు మావే. వీటికి ట్రస్టీలు మేమే.

5. మా భూగర్భ జల వనరులు వేగంగా తరిగిపోతున్నాయి. చాలా ఏళ్ళుగా పరిశ్రమలు అతిగా వెలికి తీయడం, రొయ్యల క్షేత్రాలు, ఉప్పు నీటి కొయ్యల నుంచి వెలువడే వ్యర్థాలతో ఈ భూగర్భ జలాలు ఒక వైపు తరిగిపోవడం, మరో వైపు కలుషితం కావడం జరుగుతోంది. మా భూగర్భజలం ఉప్పునీటిగా మారిపోతోంది. ఈ పరిస్థితిని అరికట్టి స్థానిక నీటి సంరక్షణ పద్ధతులను ప్రోత్సాహించాలి. విచక్షణా రహిత అడవుల విధ్వంసాన్ని నివారించాలి.

6. ప్రస్తుత రక్షిత ప్రాంతాలలో పశుపోషకులకు సాధికారత కల్పించాలి. పశువుల మేతకు అవసరమైన పశుగ్రాసం పెంచడానికి వారు సాంప్రదాయంగా ఉపయోగిస్తున్న అటవీ ప్రాంతాలను కమ్యూనిటీ కన్సర్వ్డ్ ఏరియా (సి.సి.ఎ)లుగా గుర్తించాలి. వారు, వారితో పాటు ఇతర కమ్యూనిటీలు జీవవైవిధ్య పరిరక్షణలో నిర్వహిస్తున్న కీలక పాత్రకు గుర్తింపు ఇవ్వాలి. వారి శక్తి యుక్తులను, సామర్థ్యాన్ని గుర్తించాలి.

7. సాంప్రదాయ మత్స్యకారులను తీరప్రాంతం, నీటి వనరులకు సంరక్షకులుగా గుర్తించాలి. చారిత్రకంగా మా కమ్యూనిటీలకు నీరు, భూమి అంచులే నివాసప్రాంతాలు. పూర్వీకులు అప్పగించి వెళ్ళిన సాంప్రదాయ పద్ధతులతో వనరులను సమర్ధంగా నిర్వహిస్తున్నాం. ఈ ప్రయత్నంలో మేము నిత్యం మా ప్రాణాలను పణంగా పెడుతున్నాం. ప్రకృతి సవాళ్ళకు తోడు ఇప్పుడు వాతావరణ సంక్షోభం మా కష్టాలను మరింత తీవ్రతరం చేసింది. ఎప్పుడో భవిష్యత్‌లో గాక వాస్తవంగా ఇప్పటికే మేము కష్టాలతో కాపురం చేస్తున్నాం. ఈ పరిస్థితి మా జీవనోపాధిని మరింత జటిలం చేసింది.

ఒక ప్రణాళిక లేని విధానాలు, అభివృద్ధి పై వ్యామోహం, వనరులపై అత్యాశ వల్ల సుస్థిర ప్రగతిని సాధించలేము. ఉదాహరణకు, మా తీర ప్రాంతాల రక్షణ కోసమంటూ నిర్మించిన ఎత్తయిన గోడలు మా సముద్ర తీరాల (బీచ్) లను ధ్వంసం చేసి మమ్మల్ని ఏకాకులుగా చేసాయి. మా జీవనం తీర ప్రాంతాలతో ముడిపడి ఉన్నందున అనేక సమస్యలకు మేము జవాబుదారులమని గుర్తించండి. ఈ వ్యవస్థలపై మా అజమాయిషిలో మా నిర్వహణలో జోక్యం చేసుకోకండి.

8. పర్యావరణం పై అభివృద్ధి పథకాల ప్రతికూల ప్రబావం లేని చర్యలు చేపట్టండి. మా సాంప్రదాయ హక్కులు, భూభాగాలు, వనరుల నిర్వహణ వ్యవస్థలు, పర్యావరణ పద్ధతులపై ప్రభావం చూపే ఎటువంటి నిర్ణయమైనా ప్రయివేటు. పరంగా, లేదా ప్రభుత్వ పరంగా ఎటువంటి చర్యలయినా తీసుకునేముందు మాతో సంప్రదించి మా అనుమతి పొందవలసిందిగా కోరుతున్నాం.

9. ప్రభుత్వ విధానాలు పూర్తిగా ప్రజల కోసమే ఉద్దేశింపబడాలి. అవి ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఉదాహరణకు, లోపభూయిష్టమైన ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటలకు పర్యావరణ భీమా వంటి చర్యలతో చిన్న రైతులకు చేయూతనందించడం ఎంతో సమయోచితంగా ఉంటుంది. విధాన నిర్ణయాలకు సంబంధించిన అన్ని స్థాయిలలోను మహిళలు, వితంతువులు, కుటుంబ పోషణకు ఆధారమైన మహిళలకు చురుకైన భాగస్వామ్యం కల్పించడంతో పాటు చిన్న, సన్నకారు రైతాంగానికి పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించాలి.

10. వాతావరణ మార్పు పై పోరాటంలో ముందున్న యోధులుగా ఈ కమ్యూనిటీ సభ్యులందరికీ గుర్తింపునిచ్చి ఈ వైవిధ్యాన్ని అనుసరించి, పెంపొందించే దిశగా ప్రోత్సాహకాలు కల్పించే విధాన పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

## తుదిపలుకు

మేము ఎల్లవేళలా స్థిరమైన జీవితాలను సాగిస్తున్నాం. ప్రకృతిని, నేలతల్లిని ప్రేమిస్తున్నాం. ఆమె మాకు ఎప్పుడూ అన్యాయం చేయదు. మా దైనందిన అవసరాలకు చాలినంతగా ఆమె మాకు ఎల్లవేళలా సమకూరుస్తునే ఉంటుంది. మాకు అవసరమైనంత మేము తీసుకున్నాక కూడా అడవులు, సముద్రాలలో ఎలాంటి మార్పు లేదు. వాగులు, అలలు ఆహ్లాదకరంగా పయనిస్తున్నాయి. భూమి, పర్వతాలు, సముద్రాలు, అడవులను పూజించవలసిన అవసరాన్ని

మా పూర్వీకులు మాకు బోధించారు.  వాటి పట్ల మాకు పూర్తి విధేయత వుంది.  మా వ్యవసాయం దోపిడికే గురయ్యేది కాదు.  మా పంటలు పూర్తి సురక్షితం.  మా చేపల వేట, చేపల పెంపకం సీజన్ ప్రకారమే ఉంటుంది.  ఈ పచ్చిక బయళ్ళు ప్రకృతి సమతూకంతో ఉంటాయి.  పర్యావరణానికి ఎన్నడూ హాని కల్గించవు.

మేము అనేక రకాల పంటలు పండిస్తాం.  వాతావరణ సవాళ్ళను తట్టుకునే కూరగాయలను సాగు చేస్తాం.  మా అడవులు, స్థానిక పశు, జంతుగణం ఎటువంటి మార్పులనైనా తట్టుకుంటాయి.  ముఖ్యంగా జొన్నలు, సంప్రదాయ వరి, పెండలం, చిలకడ దుంప, అరటి తదితర పంటలు పొడినేలల్లోను, దుర్భిక్షం వంటి పరిస్థితులలోను సైతం బాగా పెరుగుతాయి.  శతాబ్దాల నాటి వ్యవసాయ పరిజ్ఞానాన్ని మా కమ్యూనిటీలు కలిగి ఉన్నాయి.

ఈ శక్తి యుక్తుల నేపథ్యంలో వాతావరణ సంక్షోభాన్ని సానుకూలంగా ఎదుర్కోగలమని మేము ధీమాగా చెప్పగలం. అయితే మా విజ్ఞానాన్ని లేదా ప్రకృతిని అర్థం చేసుకోకుండా రూపొందించిన విధానాలను మా పై బలవంతంగా రుద్దితే మాత్రం ఇది సాధ్యపడదు.

ఈ సంక్షోభాన్ని అదిగమించాలని చిత్తశుద్ధితో కోరుతున్నట్టయితే మా పరిజ్ఞానాన్ని గుర్తించి, మా శక్తి యుక్తులకు, ప్రకృతి పట్ల మాకు గల సామరస్య పూర్వక అవగాహనకు ప్రకృతికి సంబంధించిన అంశాలతో వ్యవహరించడంలో మాకు గల సామర్థ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

**ఇట్లు.................**

- బైగాస్, బైగాచక్ కవర్ధ జిల్లా, ఛత్తీస్‌ఘడ్
- భిల్స్ అండ్ భిలాలస్, నిమార్, ధార్ జిల్లా, మధ్యప్రదేశ్
- చకేసంగ్ నాగాస్, చిజామి, ఫెక్ జిల్లా, నాగాలాండ్
- దళిత రైతులు, సెంబగనూర్, దిండిగల్ జిల్లా, తమిళనాడు
- దళిత రైతులు, శివకాశి, విరుధ్ నగర్ జిల్లా, తమిళనాడు
- డోంద్రియా కొండిస్, నియామ్‌గిరి హిల్స్, రాయిగడ జల్లా, ఒరిస్సా
- జిలే, చషి అండ్ మౌలే, సుందరబన్ ఎన్ అండ్ ఎస్ 24, పరగనాస్ జిల్లా, వెస్ట్ బెంగాల్
- కౌంటా, ఖతియా, పంద్రా అండ్ లోలియా, చిల్కా లేక్, పూరి జిల్లా, ఒరిస్సా
- మాల్ధారీస్, భిమోరా, సురేంద్రనగర్ జిల్లా, గుజరాత్
- పరవ, ముత్తురాయర్ అండ్ నాడార్, గల్ఫ్ ఆఫ్ మన్నార్, రామనాధపురం జిల్లా, తమిళనాడు
- సంథాల్స్, దేవీపూర్, డియోగర్ జిల్లా, జార్ఖండ్
- దళిత మహిళా రైతులు, జహీరాబాద్, మెదక్ జిల్లా, ఆంధ్రప్రదేశ్